క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టండి

పటాన్‌చెరు: అమలుకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపాన్ని ప్రజలు గమనించి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పటాన్‌చెరు మండల పరిధిలోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 8వ తేదీ సాయంత్రం 6:00 నుంచి 9 గంటల వరకు పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ సర్కిల్లో ఏర్పాటు చేయనున్న మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షోకు ప్రజలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు పాండు, సీనియర్ నాయకుడు దశరథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఓ, ఏపీఓల శిక్షణా కేంద్రం పరిశీలన



మాట్లాడుతున్న సమీర్ మాధవ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరులోని శ్రీచైతన్య హైస్కూల్లో నిర్వహిస్తున్న పీఓ, ఏపీఓల శిక్షణా కేంద్రాన్ని మెదక్ పార్లమెంట్ సాధారణ ఎన్నికల పరిశీలకులు సమీర్ మాధవ్(ఐఏఎస్) బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓలదే కీలక పాత్ర అన్నారు. ఎన్నికల నిర్వహణ సక్రమంగా ఉంటే ఎటువంటి కేసులు లేకుండా ఉంటాయని తెలిపారు. అనంతరం గుమ్మడిదల, పటాన్‌చెరులో ఉన్న చెక్ పోస్టు, ఏఆర్వో కార్యాలయంతో పాటు రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో ఉన్న స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. ఆయన వెంట ఏఆర్వో దేవుజా, మాస్టర్ ట్రైనర్ అమరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

హామీల అమల్లో విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): హామీల అమల్లో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గాజుల్‌పాడ్ గ్రామంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2లక్షల రుణమాఫీ, గృహిణులకు రూ.2500 గౌరవభృతి, రూ.4000 ఫించన్ ఇస్తామని మోసపూరిత హామీలతో అధికారం చేజిక్కించుకొని మోసం చేస్తోందన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గాలి అనిల్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ అధ్యక్షుడు గంగారాం, నాయకులు వెంకట్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ పత్రాలు అందజేత



పింఛన్ పత్రాలను అందజేస్తున్న విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పీఎఫ్ కార్యాలయంలో ఏప్రిల్ నెలలో భాగంగా 31 మందికి పింఛన్లు మంజూరు కాగా 14 మందికి పింఛన్ మంజూరు పత్రాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ, ప్రాంతీయ కార్యాలయాల సంస్థ తమ చందాదారులకు, పింఛన్‌దారులకు చేరువయ్యేటట్లు ప్రయాస్ పథకంలో భాగంగా పదవీ విరమణ పొందినవారికి నెలలోపు ఫించన్ మంజూరు పత్రాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ శ్రీదేవి, అకౌంట్స్ అధికారి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటేయాలి



కవాతు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

కల్హేర్(నారాయణఖేడ్): ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలని కల్హేర్ ఎస్ఐ వెంకటేశం అన్నారు. కృష్ణాపూర్, మార్డి, మాసాన్‌పల్లి, నాగధర్, బాచేపల్లిలో సీఆర్‌పీఎఫ్ బలగాలతో బుధవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నియామవళిపై అవగాహన కల్పించారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది గంగారాం పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో ఉద్యమిద్దాం

- కార్మిక హక్కులను కాపాడుకుందాం
- మేడే దినోత్సవంలో వక్తలు

సంగారెడ్డి టౌన్: జిల్లావ్యాప్తంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల జెండాలను ఆవిష్కరించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రతిఒక్కరూ పోరాడాలని, మేడే స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.



రామచంద్రాపురం: మేడే వేడుకల్లో పాల్గొన్న మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, నాయకులు



సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవనం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు



జిన్నారం: ఖాజీపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు



పటాన్‌చెరు: జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి



పటాన్‌చెరు టౌన్: మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయమల్లికార్జున్



జహీరాబాద్ టౌన్: మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం



జహీరాబాద్: మేడే వేడుకల్లో పాల్గొన్న విద్యుత్ వర్కర్స్ యూనియన్ (బీ-2871) నాయకులు



కోహీర్: మేడే ఉత్సవాల్లో పాల్గొన్న దిగ్వాల్ ఫిరమల్ ఫార్మా లిమిటెడ్ కర్మాగారం కార్మికులు



కంది: జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు



నారాయణఖేడ్: ఏఐటీయూసీ జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న నాయకులు



పటాన్‌చెరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



రామచంద్రాపురం: జీహెచ్‌ఎంసీ కార్మికులను సన్మానిస్తున్న బ్రహ్మకుమారిస్

కాంగ్రెస్‌లోకి చేరికలు



జిన్నారం: కాంగ్రెస్‌లోకి నాయకులను ఆహ్వానిస్తున్న నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారంకు చెందిన బీఆర్‌ఎస్ నేత ఓంకార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, యువకులు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిరుమలవాసు, ప్రతాప్‌రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



వట్‌పల్లి: మంత్రి దామోదర సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

అందోలు మండల పరిధిలో...

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని డాకూర్ గ్రామానికి చెంది మండల బీఆర్‌ఎస్ నాయకుడు జీఆర్ శ్రీనివాస్‌రెడ్డి మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ మార్కెట్ చైర్మన్ పద్మనాభరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు మధుసూధన్ రెడ్డి, కౌన్సిలర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

అడ్రసు ఒకరిది.. గుర్తింపు కార్డు మరొకరిది

నారాయణఖేడ్: అర్హులైనవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం విస్తృతంగా ప్రచారం చేసింది. దీంతో అర్హులైన వారు ఆన్‌లైన్‌లో కొత్తగా ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోగా ఎన్నికల సంఘం కొరియర్‌లో ఓటరు గుర్తింపు కార్డులను పంపింది. అయితే ఖేడ్ పట్టణానికి చెందిన పూసిని లక్ష్మినారాయణ, పూసిని ఈశ్వరమ్మ, పూసిని మాణిక్యం కొత్త ఓటర్లుగా నమోదు చేయించుకోగా బుధవారం ఓటరు గుర్తింపు కార్డులకు సంబంధించి కొరియర్ కవర్లు వచ్చాయి. అయితే వాటిని విప్పిచూస్తే ఆకార్డులు తమవి కాక ఇతరులవని ఉండటంతో వారు అవాక్కయ్యారు. ఓ కవర్‌పై అడ్రసు పూసిని లక్ష్మి నారాయణది ఉండగా అందులో సవితాబాయి విస్లావత్‌కు సంబంధించిన ఓటరు గుర్తింపు కార్డు, పూసిని ఈశ్వరమ్మ అడ్రసుతో ఉన్న కవర్లో పింకిబాయి విస్లావత్‌కు సంబంధించిన కార్డు ఉండగా పూసిని మాణిక్యం అడ్రసుతో వచ్చిన కవరులో సక్కుబాయి విస్లావత్ ఓటరు గుర్తింపు కార్డు ఉండగా కార్డులో ఓటరు ఫొటో స్థానంలో ఆధార్‌కార్డు ఫోటో ఉంది. పోలింగ్ తేది సమీపిస్తున్నందునా తమకు వచ్చిన వారి ఓటరు గుర్తింపు కార్డులను వారికి అందజేసి తమ ఓటరు గుర్తింపు కార్డులు తమకు అందజేయాలని బాధితులు ఎన్నికల సంఘ అధికారులను కోరుతున్నారు.



ఓటరు ఫొటో స్థానంలో ఉన్న ఆధార్ కార్డు

అనాథలకు సరుకుల పంపిణీ



సరుకులతో అనాథ చిన్నారులు

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం చీమల్‌పాడు గ్రామానికి చెందిన మొట్టె దయానంద్, లక్ష్మి దంపతులు ఏడాది కిందట అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో 12 ఏళ్లలోపు వయస్సు ఉన్న అఖిలాష్, హనీప్రిన్సీ, దీనా అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న ఎన్టీ డాటా సాఫ్ట్‌వేర్ సంస్థ డైరెక్టరు తిప్పరాజు ప్రసాద్ సహకారంతో సామాజికవేత్త చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి ఆసం సాయిలు మంగళవారం నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, వస్తువులను పంపిణీ చేశారు.

నియామకం

కంది(సంగారెడ్డి): ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడుగా కందికి చెందిన అయిలాల శంకర్ మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాపయ్య మాదిగ నియామకపు ఉత్తర్వులను శంకర్‌కు అందజేశారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడుగా బాలేష్, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా రాములు, ఉపాధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శి నర్సింలు నియమితులయ్యారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని శంకర్ తెలిపారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేత

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని నాగుర్(కే)లో చేపట్టిన ఉపాధి పనుల వద్ద అధికారులు బుధవారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు కూలీలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సుభాష్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండలతో జాగ్రత్తగా ఉండండి

నారాయణఖేడ్: ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు జాగ్రత్తగా ఉండాలని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య సూచించారు. ఖేడ్ ఆర్టీసీ డిపోలో బుధవారం మధ్యాహ్నం ఉద్యోగులు, కార్మికులకు మజ్జిగను పంపిణీ చేసి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా విధులు నిర్వర్తించడం తప్పనిసరికాగా ఎండలు తీవ్రంగా ఉన్నందునా విధుల్లో ఉన్న సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరు దశరథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పటాన్‌చెరు టౌన్: లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నాయి. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడా గ్రామ పంచాయతీ సమీపంలో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్లైయింగ్ స్క్వాడ్-2 అధికారి హరిశంకర్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నిబంధన మేరకు రూ.50 వేలు మించి నగదు రవాణా చేస్తే నగదుకు సంబంధించిన రశీదు ఉండాలని సూచించారు.ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అసిస్టెంట్ అధికారి సుభాష్, పోలీసులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల ప్రచారం



మహిళలతో మాట్లాడుతున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. అనంతరం పంట పొలాల వద్ద పనులు చేస్తున్న రైతులతో మాట్లాడారు. కేంద్రంలో ప్రధానమంత్రి మోదీ చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. నాయకులు రాజిరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ శిబిరం ప్రారంభం

కొండాపూర్(సంగారెడ్డి): సమ్మర్ క్యాంపులో భాగంగా మండల పరిధిలోని గంగారం పాఠశాలలో యోగా శిక్షణ శిబిరం బుధవారం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని ఎంపీటీసీ కాంతయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోచ్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు చిన్నారులు ఎవరైనా సరే ఆసక్తి ఉంటే యోగా క్యాంపునకు రావాలని, ఈ శిబిరం ఈ నెల 31వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

బీఆర్‌ఎస్ శ్రేణుల ఇంటింటి ప్రచారం

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 20, 15, 11, వార్డుల్లో జహీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ డీబీ నాగభూషణం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను హామీలను నెరవేరుస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. మాజీ ఎంపీపీ అధ్యక్షుడు రామాగౌడ్ బీఆర్‌ఎస్ నాయకులు చాపల వెంకటేశం, మల్లేశం, బాబా, శంకర్, మహేష్‌యాదవ్, గోరే, అశోక్, నాగరాజు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాంగ్రెస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



నారాయణఖేడ్: ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



కంగ్టి: ముకుందతండాలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రజల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఖేడ్ మండలంలోని జూకల్ తండా, పోతన్‌పల్లి, మాధ్వార్, హన్మంతరావుపేట, లింగాపూర్, జూకల్, చందాపూర్, అనంతసాగర్, బంద్రాన్‌పల్లి, సత్యగామ గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరఫున ఎన్నికల ప్రచార సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ హయాంలో నిరుద్యోగం, కార్పొరేట్లకు అందలం, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం, నల్లచట్టాలు ఇలా అనేక ప్రజావ్యతిరేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో పార్లమెంటు ఎన్నికల ఖేడ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శశికళరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, ఖేడ్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహెర్‌అలీ, మండల ఇన్‌చార్జి సుధాకర్‌రెడ్డి, నాయకులు సాగర్ షెట్కార్ పాల్గొన్నారు.

కంగ్టి(నారాయణఖేడ్): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నారాయణఖేడ్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి శశికళరెడ్డి అన్నారు. మండలంలోని నాగుర్(బీ), నాగుర్(కే), భీంరా, కంగ్టి, దెగుల్‌వాడి, ముకుందతండాల్లో మంగళవారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ శివరాథోడ్ నాయకులు సర్దార్ రాథోడ్, మైపత్‌నాయక్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం

జహీరాబాద్: ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని రాహుల్-ప్రియాంక గాంధీ యువమంచ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. జహీరాబాద్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ ఎంపీగా పోటీ చేస్తున్న సురేష్‌షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సందీప్ కుమార్, మల్లయ్య, జయరాములు, యాదయ్య, సంగ్రాం, భాస్కర్ పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు



జిన్నారం: ప్రచారంలో పాల్గొన్న నాయకులు

ముమ్మరంగా ఇంటింటి ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లి, నల్లవల్లి, నల్లవల్లితాండా తదితర గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా బుధవారం మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. ఎంపీగా నీలం మధు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

యువజన కాంగ్రెస్ విభాగం ఆధ్వర్యంలో

ఝరాసంగం(జహీరాబాద్): కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ కు మద్దతుగా మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామంలో యువజన కాంగ్రెస్ విభాగం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు రాజ్ కుమార్, రోహిత్, రఘు, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రకాష్, సిద్దు పాటిల్, అభిలాష్ రెడ్డి, నరేష్ కుమార్, ప్రవీణ్ కుమార్, భీమన్న, కేశన్న, దశరథ్, గోపాల్, మోహన్, కృష్ణ, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న పనులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మట్టి, పూడిక తీసివేత పనులు జరుగుతున్నాయి. ఉపాధి హామీ పనులను ఈజీఎస్ సిబ్బంది పరిశీలించి కూలీలకు పలు సూచనలు ఇచ్చారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కూలీ పనులపై అవగాహన కల్పించారు.



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

సీఎం సభను విజయవంతం చేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): నేడు సిద్దిపేట్‌లో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి బుధవారం కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సిద్దిపేటలో జరిగే సమావేశానికి అందరు హాజరై విజయవంతం చేయాలని, ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, అశోక్, పెంటయ్య, నాగరాజు, అన్వర్, అమరేందర్, రంగాచారి, నాగరాజుగౌడ్, రమేష్, మహేష్, సత్యనారాయణ, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

హవేళిఘణాపూర్(మెదక్): భర్త మందలించాడని భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రం హవేళిఘణాపూర్‌కు చెందిన భూమమ్మ(54) సోమవారం భర్త పోచయ్యతో గొడవపడి పురుగుల మందు తాగింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే మెదక్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా.. మూడు రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.